క్లుప్తంగా

రూ.30 వేల విలువైన రథం తాడు విరాళం



రథం తాడును అందజేస్తున్న దాతలు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి రథానికి అవసరమైన తాడును భక్తులు విరాళంగా అందజేశారు. నక్కపల్లికి చెందిన శ్రీపాద ప్రణవ్, అడ్డురోడ్డుకు చెందిన తేజ, ఉపమాకకు చెందిన డాక్టర్ వేదాల గాయత్రీదేవి సుమారు రూ.30వేలు విలువైన తాడు కొనుగోలు చేసి దేవస్థానం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ప్రధానార్చకులు వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచార పత్రాల పంపిణీ



భక్తులకు ప్రచార పత్రాలను అందజేస్తున్న కొల్లి అప్పారావు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఎల్లారమ్మ భక్తులు చేపట్టే దీక్ష, ఉత్సవాలకు శతాబ్దానికి పైగా చరిత్ర ఉందని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. కొండకర్ల ఎల్లారమ్మ గుడి వద్ద దీక్షదారులను శుక్రవారం కలిసి హిందూ ధర్మ ప్రచార పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా ఉగది నాడు భక్తిశ్రద్ధలతో ఎల్లారమ్మ ఉత్సవాలు నిర్వహిస్తారని చెప్పారు.

సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన



ఉమ్మలాడ సచివాలయాన్ని సందర్శిస్తున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ సచివాలయంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో పి.రవికుమార్ సందర్శించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పుస్తకం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుపై ఆరా తీశారు.అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లల హాజరు పరిశీలించారు. వారికి అందించే పోషకాహారాన్ని రుచి చూశారు. ఆయన వెంట సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ ఉన్నారు.

రామాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రతినిధి

మునగపాక: స్థానిక దళితవాడలో రామాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు శుక్రవారం తన ప్రతినిధి ద్వారా రూ.లక్ష విరాళం అందజేశారు. గతంలో రూ.2లక్షలు అందజేసిన రమణమూర్తిరాజు ఆలయ అభివృద్ధికి మరో రూ.లక్ష అందజేశారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, దళితనాయకులు బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

ఎస్.రాయవరం: గోకులపాడు నూకాంబిక అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.జనపా త్రినాథరావు, అమ్మాజీ దంపతుల ఆర్థిక సాయంతో ఆలయంలో అన్న సమారాధన చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పులకించిన ఉపమాక

- వెంకన్న కల్యాణోత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- జనసంద్రమైన గరుడాద్రి
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బాబూరావు



మెట్ల మార్గంగుండా గరుడాద్రిపైకి వెళ్తున్న భక్తులు



స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే బాబూరావు దంపతులు

నక్కపల్లి: కోనేటి రాయుడి కల్యాణాన్ని కనులారా తిలకించేందుకు తండోపతండాలుగా భక్తులు తరలి వచ్చారు. వేలాదిమంది రాకతో ఉపమాక కిటకిటలాడింది. గరుడాద్రి, ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. నిజరూపంలో స్వామి దర్శనం చేసుకున్న భక్తులు అలౌకికానందంతో పులకించిపోయారు.

తెల్లవారుజాము నుంచే దర్శనాలు ప్రారంభం

కొండపై కల్కి అవతారంలో గల మూలవిరాట్‌కు శుక్రవారం తెల్లవారు జామున 3గంటలకు తొలిఅభిషేకం నిర్వహించారు. నిత్యార్చనలు పూర్తిచేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. కల్యాణం రోజున స్వామి నిజ రూపాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజామున రెండుగంటలనుంచే భక్తులు మెట్లమార్గంలో మూలవిరాట్ సన్నిధికి చేరారు. ఆలయముఖద్వారానికి ఎదురుగా ఉన్న ఆస్థాన మండపం,బేడామండపం, స్వామి ఉత్సవమూర్తులున్న మండపం, మెట్లమార్గం, ఉపమాకపురవీధులు వేలాదిమంది వెంకన్న భక్తులతో కిటకిటలాడాయి.

పుష్కరిణిలో పుణ్యస్నానాలు

బ్రహ్మ తపస్సు చేసిన బందుర సరస్సు(పుష్కరిణి)లో వేలాది మంది భక్తులు పుణ్యస్నానమాచరించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా రాష్ట్రాలనుంచి భారీగా తరలివచ్చారు.

అద్దాలమహల్‌లో మలయప్పస్వామి

సర్వాభరణాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన శ్రీదేవీభూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ధ్వజస్తంభం ఎదురుగా ఉన్న అద్దాల మహల్ ఉంచి భక్తులకు దర్శనం కల్పించారు. కల్యాణకాంతులీనుతున్న స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని చూచి తరించేందుకు భక్తులు శుక్రవారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో వేచి ఉన్నారు. మహాద్వారానికి కిలోమీటరు దూరంనుంచే క్యూలైన్లు ఏర్పాటుచేయడంతో భక్తులు గంటల తరబడి లైన్లో నిలుచుకున్నారు. ప్రభుత్వం తరఫున ఎమ్మెల్యే గొల్లబాబూరావు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. హెటిరో ప్రతినిధులు కూడా స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ఎండ బారిన పడకుండా టీటీడీవారు రాజగోపురం ఎదురుగా భారీ షెడ్లు వేయడంతో ఉపశమనం పొందారు.షెడ్ల కింద సేదతీరారు.



శేషతల్ప వాహనంపై అమ్మవార్లు



గరుడ వాహనంపై స్వామివారు

హెటిరో ఉద్యోగుల అన్నసమారాధన

ఉత్సవాలకు తరలి వచ్చిన వేలాదిమంది భక్తులకు హెటిరో సంస్థ ఉద్యోగులు అన్నదానం చేశారు. నక్కపల్లి సత్యసాయి సేవాసమితి సభ్యులు పులిహోర మజ్జిగ, మంచినీరు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో దర్శన సమయంలోను, క్యూకాంప్లెక్స్‌లవద్ద అన్నదాన కార్యక్రమం వద్ద రద్దీ ఏర్పడింది. రూ.50 టికెట్ దర్శనాన్ని అమలు చేశారు.

అలరించిన కోలాటాలు

కల్యాణోత్సవాలను పురస్కరించుకుని పలు ప్రాంతాలనుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందాలు చేసిన కోలాటం, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. టీటీడీ హిందూ ధర్మప్రచారపరిషత్, అన్నమయ్యప్రాజెక్టువారిచే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

వైద్యశిబిరాలు..

గొడిచర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి, సిబ్బంది, హెటిరో పరిశ్రమవారు ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అస్వస్థతకు గురైన భక్తులకు ఇక్కడ వైద్య సేవలు అందించారు.

పటిష్ట బందోబస్తు

కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్,నక్కపల్లి సీఐ నారాయణరావుల పర్యవేక్షణలో ఎస్‌ఐ శిరీష తదితరులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కపల్లి నూకాలమ్మ ఆలయం వద్ద, మనబానవానిపాలెం, ఉపమాక నూకాలమ్మ ఆలయాల వద్ద చెక్ పోస్టులుఏర్పాటు చేసి వాహనాలను నిలిపివేసి, కాలినడకన భక్తులను ఆలయం వద్దకు అనుమతించారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

స్వామివారిని మాజీ ఎమ్మెల్యేలు చెంగల వెంకటరావు, వంగలపూడి అనిత, కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు,గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, హెటిరో డైరెక్టర్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్‌ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న హెటిరో ప్రతినిధులు



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయం వద్ద మహిళల కోలాటం

వైభవంగా వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం





చూచుకొండలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: మండలంలోని చూచుకొండలో శుక్రవారం వేంకటేశ్వరుని ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, గరుడ విగ్రహ ప్రతిష్ట జరిపారు. రేజేటి గోప అప్పలాచార్యులు,ప్రధాన అర్చకులు వెంకట కృష్ణమూర్తి శాస్త్రి,ఆలయ పురోహితులు కాశీ నేతృత్వంలో ప్రత్యేక పూజలు జరిపారు.డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ,ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్,సర్పంచ్ దొడ్డి సూరప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

పారిపల్లెమ్మ పండగ పోస్టర్ ఆవిష్కరణ

వాడ్రాపల్లి పారిపల్లెమ్మ పండగ పోస్టర్‌ను డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ(తేజ) శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీన అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సుకుమారవర్మ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కన్నుంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



సబ్ ట్రెజరీలో సమస్యలు తెలుసుకుంటున్న డీటీవో సుభాషిణి

కోటవురట్ల: పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ట్రెజరీ అధికారి వి.ఎల్.సుభాషిణి తెలిపారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొద్ది నెలల క్రితం తాత్కాలికంగా పెన్షనర్ల విశ్రాంత భవనంలోకి మార్చారు. ఈ నేపథ్యంలో డీటీవో సుభాషిణి శుక్రవారం కార్యాలయాన్ని సందర్శించి వసతులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా పెన్షనర్లను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం కోసం భవనాన్ని ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 8 సబ్ ట్రెజరీలు ఉన్నట్టు తెలిపారు. వీటిలో కొన్నింటికి సొంత భవనాలు లేవని, కోటవురట్ల కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం కోసం ప్రతిపాదన పెట్టినట్టు తెలిపారు. జిల్లాలో 8500 మంది పెన్షనర్లు ఉన్నారని వారికి ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎస్టీవో నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగు శిబిరానికి విశేష స్పందన



మునగపాక సచివాలయంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

మునగపాక: స్థానిక సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ కంటి వెలుగు శిబిరానికి విశేష స్పందన లభించింది. 124 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యాధికారి సంధ్య గుర్తించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకొకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' సక్రమంగా అమలు



భోజనం రుచి చూస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో అప్పారావు

కోటవురట్ల: జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంఈవో పి.అప్పారావుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల ఆవరణ, వంటశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని హెచ్‌ఎంకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ తనిఖీ చేసి స్టాకు పరిశీలించారు.

దుర్గాంబిక ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట

రాంబిల్లి: కొత్తపేటలో దుర్గాంబిక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. తప్పెటగుళ్లు, భజనలు, కోలాటాల కార్యక్రమాలను నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ(తేజ),ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్, మండల సచివాలయాల కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ అరుణలత తదితరులు, అనంతరం గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



సర్వసిద్ధిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

ఎస్.రాయవరం: సచివాలయాల సిబ్బంది సకాలంలో హాజరై విధులు సక్రమంగా నిర్వహించాలని నర్సీపట్నం డీఎల్‌డీవో యు.ఉదయశ్రీ తెలిపారు. ఎస్.రాయవరం 1,2, సర్వసిద్ధి సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ శాఖలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ సేవలను సిబ్బంది మరింత నాణ్యంగా అందించాలని తెలిపారు. గ్రామవలంటీర్ల సహకారం తీసుకుని అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీకేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం



డాక్టర్ విష్ణుమూర్తిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు



పూలమాలలతో కనకమహాలక్ష్మికి అలంకరణ

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం కనకమహాలక్ష్మి తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. వేద మంత్రాల నడుమ కుంకుమార్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు సేవించారు. ఎంపీ బీవీ సత్యవతి భర్త డాక్టర్ కె.విష్ణుమూర్తి అమ్మ వారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆయనకు ఉత్సవ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శక్తి స్వరూపిణి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించాలి



మునగపాకలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మునగపాక: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం మునగపాకలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల పరిధి మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు,మండల అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు,మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పీఎంసీ చైర్మన్ ఆడారి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

ఎస్.రాయవరం: టీడీపీ బలపరచిన చిరంజీవిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు.మండలంలో పలు పాఠశాలలు ,కళాశాలల్లో ఆమె ప్రచారం చేశారు.

డీపీవో ఆకస్మిక పర్యటన



తుమ్మపాల డంపింగ్ యార్డులో డీపీవో

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో శుక్రవారం డీపీవో ఆర్.శిరీషారాణి ఆకస్మికంగా పర్యటించారు. వెంకుపాలెం రహదారి పక్కనున్న డంపింగ్‌యార్డును పరిశీలించారు. చెత్త తరలింపు ప్రక్రియ ఎప్పటికప్పుడు సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ ఆరాతీశారు. డంపింగ్ యార్డుకు సంబంధించి కొత్తగా నిర్మించిన వాచ్‌మెన్ రూంను, నేమ్ బోర్డును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు స్థలం, పరిసరాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ట భద్రత చేపట్టాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఈవో కె.శ్రీనివాసరావును ఆదేశించారు. బొజ్జన్న కొండకు వెళ్లే రహదారిలో టైర్ల పంక్చర్ షాపు నిర్వాహకుడు రోడ్డుపై అడ్డంగా టైర్లు పెట్టిన విషయాన్ని గమనించారు. వాటిని తొలగించాల్సిందిగా సిబ్బందిని సూచించారు. గతంలో కలెక్టర్ కూడా దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో తొలగించినా మళ్లీ యథాస్థితి కొనసాగడంతో స్థానిక అధికారుల పర్యవేక్షణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో అప్పటికప్పుడు ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది టైర్లను తొలగించారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఎంపీడీవో కె.ధర్మారావు, ఈవో కె.శ్రీనివాసరావు, సిబ్బంది సత్యనారాయణ, ఫణికుమార్, ఈశ్వరరావు ఉన్నారు.

త్వరితగతిన ఆధార్ అనుసంధానం



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్ : ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ బీఎల్‌వోలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అనకాపల్లి, కశింకోట మండలాల బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఆశించిన స్థాయిలో చురుగ్గా జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై బీఎల్‌వోలంతా త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన 6బీ ఫారాల సేకరణను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా వలస ఓటర్లు, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓట్ల ఏరివేత పూర్తయ్యేలా చూడాలన్నారు. శతశాతం పూర్తికి బీఎల్‌వోలంతా కృషి చేయాలన్నారు. తరచూ దీనిపై సమీక్షించనున్నట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీవో దృష్టికి తెచ్చారు. సమస్యల్ని అధిగమించి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందన్నారు. సమీక్షలో అనకాపల్లి తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీడీవో ధర్మారావు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం బృందం పర్యటన నేడు

సబ్బవరం : అమృతపురంలో చేపట్టిన ప్రకృతి సేద్యాన్ని రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్‌తో పాటు సత్య త్రిపాఠి బృందం శనివారం పరిశీలించనుందని అనకాపల్లి డీపీఎం లచ్చన్న తెలిపారు. క్షేత్ర పరిశీలన తర్వాత సచివాలయంలో రైతులు, మహిళా సంఘాలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంపై సమీక్షించనున్నారు.

వైరల్ జ్వరాల కట్టడికి చర్యలు

- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర

పరవాడ : వైరల్ జ్వరాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తానాం రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించి వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులకు అవసరమైన మందులు అందించి జ్వరాలు తగ్గు ముఖం పట్టే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాలువలు, చెత్తా చెదారాల తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించాలన్నారు.